క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టి సారించాలి

కొల్లూరు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారులు దృష్టి సారించాలని తహసీల్దార్ ఎ. శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఐ. సత్యనారాయణ రావు చెప్పారు. కొల్లూరు జగనన్న కాలనీలో శనివారం లబ్ధిదారులు, గ్రామ వలంటీర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అందజేస్తున్న రూ. 1.80 లక్షలకు తోడు డ్వాక్రా సంఘాల సభ్యులకు అదనంగా మరో రూ. 50 వేలు రుణం అందిస్తున్నట్లు చెప్పారు. దశల వారీగా ప్రభుత్వం నుంచి అందే నగదు, నిర్మాణానికి అవసరమైన సామగ్రి పంపిణీ గురించి వలంటీర్లు కూడా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఈఓ బి. మల్లికార్జున పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రసాదాల పంపిణీ

వెల్లటూరు(భట్టిప్రోలు): మండలంలోని వెల్లటూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో కోటిపల్లిలో కొలువైన శ్రీ సత్యజ్ఞాన ప్రసూనాంబ సహిత సోమశేఖరస్వామి దేవాలయంలో మహా శివ రాత్రి సందర్భంగా శనివారం భక్తులకు తీర్థ ప్రసాదాలు, పులిహోర, తాగునీరు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా రీజియన్ చైర్మన్ సీహెచ్. రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. టీమ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ, ప్రోగ్రాం ఆఫీసర్స్ నంబూరు నాగభూషణరావు, గోలి చంద్రయ్య, నంబూరి తేజ, వెల్లటూరు వాసవీ క్లబ్ అధ్యక్షుడు నాగళ్ల ఆంజనేయులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

కొల్లూరు: కోడి పందేల శిబిరంపై శనివారం పోలీసులు దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. గాజుల్లంక నుంచి పోతార్లంక మార్గం వెంబడి కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో ఏఎస్ఐ కొండవీటి బాబూరావు సిబ్బందితో దాడులు చేశారు. ఏడుగురితో పాటు రెండు కోళ్లు, రూ. 3 వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని తెనాలి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

రేపల్లె రూరల్: చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పిరాట్లంక జెడ్పీ హైస్కూలు ఆవరణలో కల్చరల్ అండ్ లిటరరీ కాంపిటీషన్ ఫర్ చిల్డ్రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలలకు లెవన్ అండ్ స్నూవ్, పిరమిడ్ గ్లాస్సెస్, బకెట్ ఇన్ ది బాల్, ఐడెంటీ ది నంబర్స్, బొమ్మలను గుర్తించటం తదితర ఆటల పోటీల్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో చైల్డ్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్. శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీ సందర్శించిన గృహ నిర్మాణ శాఖ పీడీ

పెనుమర్రు(వేమూరు): మండలంలోని పెనుమర్రు గ్రామంలో జగనన్న కాలనీ శనివారం బాపట్ల జిల్లా గృహ నిర్మాణం ప్రాజెక్ట్ అధికారి ప్రసాద్ సందర్శించారు. అనంతరం లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. గ్రామ సర్పంచ్ కొక్కిలగడ్డ సుమతి, డీఈ రవి కుమార్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

ఖాతాదారుల సౌకర్యార్థం విస్తృత సేవలు



చెరుకుపల్లి: ఖాతాదారుల సౌకర్యార్థం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విస్తృత సేవాల్ని అందిస్తోందని, వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆ బ్యాంక్ జనరల్ మేనేజర్ నారాయణశర్మ సూచించారు. మండలంలోని కావూరు రైతు భరోసా కేంద్రం ఆవరణలో శనివారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆరుంబాక శాఖ ఆధ్వర్యంలో ఖాతాదారులకు రాత్రి శిబిర్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణశర్మ మాట్లాడుతూ ఆరుంబాక బ్రాంచి ద్వారా ఒక్క కావూరు గ్రామంలోనే స్వయం సహాయక సంఘాలకు ఇప్పటిదాకా రూ. 10కోట్లతో పాటు వివిధ రుణాల్ని కూడా మంజూరు చేశామని చెప్పారు. ఆరుంబాక బ్రాంచి మేనేజర్ ఎస్. సత్యవతి మాట్లాడుతూ గ్రామంలో మొండి బాకీలు పెద్దగా లేవని, ఖాతాదారులంతా సక్రమంగా సకాలంలో చెల్లించి రుణాలు పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ గులాటి, రీజినల్ మేనేజర్ సర్వశ్రీ ప్రసాద్, సర్పంచ్ చెల్లి జ్యోతి పాల్గొన్నారు.

నేడు ఘంటసాల సంగీత విభావరి

తెనాలి: గంధర్వ గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా పట్టణానికి చెందిన భారతీయ సాహితీ సంస్కృత వేదిక శ్రీ కళారంజని ఆధ్వర్యంలో ఆదివారం సంగీత విభావరిని నిర్వహించనున్నారు. కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రారంభమవుతుంది. అపర ఘంటసాలగా పేరొందిన వై.ఆర్. శాస్త్రి తన గానకళా కౌశలంతో ప్రేక్షకులను రంజింపజేస్తారని అధ్యక్షురాలు డాక్టర్ కేఎస్ఎల్ పద్మావతీదేవి, కార్యదర్శి గోనుగుంట్ల మురళీకృష్ణ తెలియజేశారు.

హరహర మహదేవ.. శంభో శంకర..



బోలాయపాలెంలో ప్రత్యేక అలంకరణలో కాశీ విశ్వేశ్వరస్వామి



ప్రత్యేక పూజలందుకుంటున్న అరవపల్లి బాలకోటయ్యస్వామి



వెల్లటూరులో ప్రత్యేక అలంకారంలో శ్రీ అగస్త్యేశ్వరస్వామి



భట్టిప్రోలు విఠలేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు



అరవపల్లి బాలకోటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు బారులుతీరిన భక్తులు



విద్యుత్ కాంతులతో నిజాంపట్నంలోని శివాలయం



భక్తులతో కిక్కిరిసిన బాపట్లలోని సోమేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం



భట్టిప్రోలు బాలకోటేశ్వరస్వామి దేవాలయం చుట్టూ పశువులను ప్రదక్షిణ చేయిస్తున్న రైతులు



చందోలులో పాండవులు ప్రతిష్ఠించిన శివలింగానికి పూజలు చేస్తున్న భక్తులు

- వైభవంగా శివరాత్రి వేడుకలు
- శివనామ స్మరణతో మారుమోగిన శివాలయాలు

భట్టిప్రోలు: హరహర....శంభో శంకర.....అంటూ శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మహాశివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని శనివారం భట్టిప్రోలులోని అతి ప్రాచీనమైన శ్రీ కంచి కామాక్షి సమేత శ్రీ బాలకోటేశ్వరస్వామి, దేవతల గుడిగా ప్రద్ధి గాంచిన శ్రీ గంగాపార్వతీ సమేత శ్రీ విఠలేశ్వరస్వామి, పెదపులివర్రులోని బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ రాజరాజ నరేంద్రస్వామి, ఓలేరులోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయాల్లో స్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రీ బాలకోటేశ్వర స్వామి దేవాలయంలో వెల్లటూరు వంశీకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పశు గణాన్ని, వాహనాలను దేవాలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. స్థానిక శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి సమేత శ్రీ హేమవిఠలేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి లింగోద్భవ కాలంలో మహాన్యాసక పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. భట్టిప్రోలు నుంచి శైవ క్షేత్రాలైన గోవాడ, అరవపల్లికి రేపల్లె ఆర్టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడిపింది. మండలంలోని ఐలవరం నుంచి చిన్నారులు గోవాడ శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానానికి ప్రభను తీసుకువెళ్లారు. భట్టిప్రోలులో దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన శ్రీ విఠలేశ్వరస్వామి దేవాలయంలో నందీశ్వరుడు చెవిలో తన కోరికలను చెబితే శివయ్య ఆలకించి కోర్కెలను నెరవేరుస్తాడని భక్తుల నమ్మకం. ప్రత్యేకంగా ఈ దేవాలయానికి వచ్చిన భక్తులు నందీశ్వరుడి చెవిలో తమ కోర్కెలను చెప్పుకున్నారు.

శివ నామస్మరణతో మారుమోగిన సూరేపల్లి

శివరాత్రి పురస్కరించుకుని శనివారం స్థానికంగా కొలువైన కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో శివపార్వతుల కల్యాణం, తిరునాళ్లు అంగరంగ వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు స్వామికి భక్తులే స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. కార్యనిర్వాహకులు వల్లూరి విశ్వేశ్వరరావు(బాబు) ఆధ్వర్యంలో 10 వేల మందికి అన్నదానం జరిపారు. భట్టిప్రోలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

అగస్త్యేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు

వెల్లటూరులోని శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో మహా శివరాత్రి పురస్కరించుకుని శనివారం ఉదయం లింగోద్భవ కాలంలో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవంలో తంగిరాల పిచ్చయ్యశాస్త్రి, యేలేశ్వరపు చిదంబరశాస్త్రి దంపతులు పాల్గొన్నారు.

అరవపల్లి బాలకోటయ్యకు ప్రత్యేక పూజలు

రేపల్లె: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని అరవపల్లిలో బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల శనివారం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే స్వామికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పువ్వులతో అలంకరించారు. లింగోద్భవ కాల సందర్భంగా మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, జగాజ్యోతి, మహానివేదనలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకునేందుకు ఆలయం వద్ద బారులు తీరారు. వ్యాపారవేత మోపిదేవి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం: మండలంలోని పలు దేవాలయాల్లో శనివారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఖాజీపాలెంలోని కాశీవిశ్వనాథస్వామి దేవాలయంలో, మంతెనవారిపాలెం శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం, చందోలు శ్రీలింగోద్భవస్వామి క్షేత్రం, అల్లూరు శివారు రెడ్లపాలెం సమీపంలోని శ్రీ శేషాచలమేశ్వరస్వామి దేవాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో చందోలు బండ్లమ్మ దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు బుద్ధా వెంకట లక్ష్మి, ఐనంపూడి శ్రీనివారావు, మంతెన గంగరాజు, దెందుకూరి సీతారామరాజు పాల్గొన్నారు.

కర్లపాలెం: మహా శివరాత్రి వేడుకలు మండలంలో శుక్రవారం వైభవంగా జరిగాయి. కర్లపాలెం బదరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో శివస్వాములు బ్రహ్మ, విష్ణు మహేశ్వరులకు విశేష పూజలు నిర్వహించారు. శివస్వాములకు సద్ది పంపిణీ చేశారు. యాజలి, గణపవరం, పెదగొల్లపాలెం గ్రామాల్లోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలు, బోలాయపాలెంలోని శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, పేరలిలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి ఆలయం, అయ్యప్ప ఆలయంలోని శివలింగానికి, ఇందిరానగర్‌లోని ఆదిశేషుని ఆలయంలో, ఎంపీరాజుపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో, నల్లమోతువారిపాలెంలోని లలితా త్రిపుర సుందరీ ఆలయంలోని శివలింగాలకు అభిషేకాలు అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు.

కన్నుల పండువగా కల్యాణం

కొత్తనందాయపాలెంలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కావూరి ప్రసాద్‌రెడ్డిస్వామి ఆధ్వర్యంలో వేద పండితులు దుర్గా మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రాలు సమర్పించి వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. అనంతరం నిర్వహించిన అన్నదానంలో రెండు వేల మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,భక్తులు పాల్గొన్నారు. కర్లపాలెం సత్యసాయి గ్రామీణ సేవా సమితిలో శుక్రవారం రాత్రి శివపార్వతుల శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామికి అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవ క్షేత్రాలు

బాపట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణ, మండలంలోని శైవ క్షేత్రాలు భక్తులతో కిక్కిరిశాయి. సూర్యోదయానికి ముందే మహిళలు, భక్తులు ఆయా శైవ క్షేత్రాలకు చేరుకొని ప్రత్యేక పూజల్లో నిమగ్నమయ్యారు. పట్టణంలోని సోమేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కోటికం సుబ్బారావు గురుస్వామి శివరాత్రి మహిమల్ని భక్తులకు వివరించారు. శివలింగార్చన వల్ల సర్వపాపాలు హరించబడతాయని తెలిపారు. పూజలనంతరం ఉత్సవ మూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహించారు.

- పట్టణంలోని ఎస్ఎన్‌పీ అగ్రహారంలో గంగా పర్వత వర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి, వెదుళ్లపల్లిలోని శ్రీరామలింగేశ్వరస్వామి, భర్తిపూడి గ్రామాల్లోని శైవక్షేత్రాల్లో మహిళలు తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వైభవంగా మహా శివరాత్రి వేడుకలు

నిజాంపట్నం: స్థానిక గంగాబాల త్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వరస్వామి, కొత్తపాలెంలోని శ్రీ రసేశ్వరీదేవి సహిత శ్రీ రసేశ్వరస్వామి, గోకర్ణమఠంలోని గోకర్ణేశ్వరస్వామి ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. నిజాంపట్నంలోని శివాలయానికి ప్రత్యేక విద్యుత్ కాంతుల్ని ఏర్పాటు చేశారు. కొత్తపాలెంలో శివాలయం చుట్టూ పశువులు, వాహనాలను ఆలయం చుట్టూ తిప్పి భక్తి ప్రపత్తులను చాటారు. చిన్నారులు ప్రభల్ని ఏర్పాటు చేసి యడ్ల బండిపై ఆలయం చుట్టూ తిప్పారు. కొత్తపాలెంలోని శివాలయ ప్రాంగణంలో చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. గోకర్ణమఠంలోని గోకర్ణేశ్వరస్వామి, నిజాంపట్నంలోని శివాలయంలో శివలింగాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గోవాడకు పోటెత్తిన భక్తులు

గోవాడ(వేమూరు): గోవాడ బాలకోటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి దేవ దేవుడి దర్శనానికి క్యూ కట్టారు. ట్రాక్టర్లు, ఎద్దులు బండ్లతో దేవుని దర్శనం కోసం వచ్చారు. జిల్లాలో వివిధ గ్రామాల నుంచి భక్తులు రావడంతో అదుపు చేసేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు అన్నదానాలు నిర్వహించాయి.



స్వామిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

■ కమనీయం... ముక్తేశ్వరుని కల్యాణం

రేపల్లె రూరల్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని మోర్తోటలో గల ముక్తేశ్వరస్వామి ఆలయంలో శనివారం వేడుకల్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామికి అభిషేకాలు జరిపారు. ముక్తేశ్వరస్వామి, పార్వతీ అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి రాత్రి ఆలయ ఆవరణలో వేదమంత్రాలు, మేళ తాళాల నడుమ కల్యాణాన్ని అర్చకుడు సురేష్‌శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో కమిటీ సభ్యులు అన్న సంతర్పణ చేశారు. ఆలయ ఈవో నల్లవరపు నాగయ్య, సర్పంచ్ కాసాని కృష్ణకుమారి, ఆలయ చైర్మన్ రాజా మాణిక్యారావు బహదూర్, ఆలయ కమిటీ సభ్యులు పద్మజ, రాంబాబు, వెంకటేశ్వర రావు, కృష్ణకుమారి, శ్రీనివాసరావు, ఏకాంబరేశ్వరరావు పాల్గొన్నారు.



కల్యాణాన్ని నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

బాలకోటయ్యకు మంత్రి పట్టు వస్త్రాల సమర్పణ

చుండూరు(భట్టిప్రోలు): చుండూరులో కొలువైన శ్రీ బాలా త్రిపుర సుందరి బాల కోటేశ్వరస్వామి దేవాలయాన్ని శనివారం మంత్రి మేరుగ నాగార్జున సందర్శించారు.పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తలపై పెట్టుకుని స్వామికి సమర్పించారు. ఆలయ ధర్మకర్తలు, అర్చకులు మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ జూలాది రూబెన్, వైస్ ఎంపీపీ ఆళ్ల వెంకట రమణారెడ్డి, చుండూరు, వేటపాలెం ఎంపీటీసీ సభ్యులు గొర్రెపాటి శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ఉయ్యూరి అప్పిరెడ్డి, ఏసోబు, మాజీ సర్పంచ్ కంఠమనేని శ్రీనివాసరావు, ఈమని వెంకటేశ్వర రెడ్డి, రామాంజనేయులు, తహసీల్దార్ బి. కనక దుర్గ, ఈవోపీఆర్డీ జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలను తీసుకు వస్తున్న మంత్రి నాగార్జున